క్లుప్తంగా

పంచాయతీ పనులపై సమీక్షా సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ముత్తారం: మండలంలోని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో కలికోట శ్రీనివాస్ మంగళవారం తన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటిపన్నులు, నల్లా బిల్లులు వసూలు చేయడంతో పాటు పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. అదే విధంగా ప్రతి ఇంటికి తడి, పొడి చెత్తను వేరు చేసేలా చూడాలన్నారు. నర్సరీలతో పాటు ఉపాధి హామీపనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీవో వేణు మాధవ్, ఏపీవో దయామణి తదితరులు పాల్గొన్నారు.

నర్సరీని పరిశీలించిన ఎంపీడీవో

ముత్తారం: మండలంలోని దర్యాపూర్‌లో నర్సరీని ఎంపీడీవో కలికోట శ్రీనివాస్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నర్సరీలో ఏఏ మొక్కలు పెంచుతున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం నర్సరీలో పనిచేసే కూలీలకు పలు సూచనలిచ్చారు. నర్సరీలో పెంచే ప్రతి మొక్కను కంటికి రెప్పలా కాపాడాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో బైరి వేణు మాధవ్ ఉన్నారు.

నల్ల బ్యాడ్జీలతో కాంట్రాక్ట్ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ అన్ని విభాగాల కార్మికులతో కలసి సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి అశోక్ రెండో రోజు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా అశోక్ మాట్లాడుతూ జనవరి 3న కలకత్తాలో నిర్వహిస్తున్న 11వేజ్ బోర్డు సమావేశంలో సింగరేణిలో పనిచేస్తున్న అనేక మంది కాంట్రాక్ట్ కార్మికులకు కూడా న్యాయం జరిగేలా మాట్లాడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చమ్మ, నిర్మల, రాజనర్సు, శ్రీనివాస్, లత, రాము,సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు స్థలం కేటాయించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

మంథని: మండలంలోని చిన్న ఓదాల శివారులో నేతులపల్లి చెరువు శిఖం సర్వే నంబర్ 225 ప్రక్కనే ఉన్న 226,229 నంబర్‌లో ఉన్న నాలుగెకరాల గుంట సీలింగ్ భూమిని వ్యవసాయ మార్కెట్‌కు కేటాయించాలని పలువురు రైతులు బుధవారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. గత ఇరవై ఏళ్లుగా గ్రామ రైతులమంతా ఈ స్థలంలో ధాన్యం పోస్తున్నామని తెలిపారు. అలాగే 226 సర్వేనంబర్‌లోని భూమిలో గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్సీ నిరుపేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇప్పించాలని కోరారు.

డీఎస్పీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

సుల్తానాబాద్‌రూరల్: దళిత శక్తి ప్రోగ్రాం వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ రాజ్యస్థాపక కోసం పదివేల కిలోమీటర్ల పాదయాత్రకు సంఘీభావంగా మండలంలోని తొగర్రాయి గ్రామకమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో డీఎస్పీ మండల కన్వీనర్ రాము, ఉపాధ్యక్షుడు శంకర్, నాయకులు సతీశ్, రమేశ్, రాజు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

భారత దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే జయంతిని మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రం పెద్దపల్లిలో, రామగుండం, మంథని నియోజకవర్గ కేంద్రాలు, గోదావరిఖని, సుల్తానాబాద్ పట్టణాలు, అన్ని మండల కేంద్రాలు, పలు గ్రామాల్లో సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా ఆమె విగ్రహాలకు, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, మహిళల చదువుకు సావిత్రిబాయి చేసిన కృషిని పలువురు కొనియాడారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, యువజన సంఘాల నాయకులు, కుల సంఘ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. - సాక్షి, నెట్‌వర్క్



సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు



ఓదెల తహసీల్దార్ కార్యాలంలో నివాళి



గ్రంథాలయంలో చైర్మన్ రఘువీర్‌సింగ్ నివాళి



శాంతినగర్‌లో నివాళి అర్పిస్తున్న మహిళలు



ముత్తారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



కమాన్‌పూర్‌లో..



ముస్త్యాలలో నివాళి అర్పిస్తున్న సర్పంచ్, మహిళలు

అధికారులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: పల్లెల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పెద్దపల్లి నియోజకవర్గ స్థాయి కార్యదర్శులు, ఎంపీవో, ఎంపీడీవోలతో నిర్వహించిన మావేశమంలో మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలు, ఎంపీడీవోలు అంకితభావంతో పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యదర్శుల్లో ఎక్కువమంది యువకులే ఉన్నారని విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఇబ్బందులు, సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాలను పట్టణాలకు ధీటుగా తీర్చిదిద్దాలనే ఆలోచనతోనే ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్న విషయం తెలిసిందేనన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పల్లెప్రజలకు అందించేలా అందరం కలసికట్టుగా ముందుకు సాగుదామన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో శ్రీధర్, డీఎల్‌పీవో, తదితరులు పాల్గొన్నారు.

తుప్పు పడుతున్న వాహనాలు



పోలీస్‌స్టేషన్‌లో పార్కింగ్ చేసిన వాహనాలు

సుల్తానాబాద్‌రూరల్: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలు ఏళ్ల తరబడి పోలీసుస్టేషన్లోనే ఉండటంతో అవి కాస్తా తుప్పు పట్టిపోతున్నాయి. ఇందులో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు ఉన్నాయి. అధికారులు స్పందించి వాహనాలను బహిరంగ వేలం వేస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమంగా ఎర్రమట్టి తరలింపు



ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న ఎర్రమట్టి

రామగిరి: మండలంలోని బేగంపేట శివారులోని అటవీ ప్రాంతం నుంచి నిత్యం వందలాది ట్రాక్టర్లతో ఎర్రమట్టి అక్రమంగా తరలిపోతుంది. అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న భూముల్లో మట్టి తరలింపు కోసం తవ్విన గుంతలు సింగరేణి సంస్థ ఓసీపీ క్వారీలను తలపించేలా దర్శనమిస్తున్నాయి. పట్టపగలే ముత్తారం, గోదావరిఖని మీదుగా మంథని, పెద్దపల్లి ప్రధాన రహదారిపై అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వ భూముల నుంచి తరలిపోతున్న ఎర్రమట్టి అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం పట్ల విమర్శలు వస్తున్నాయి. దీనిపై తహసీల్దార్ చల్లా రాంమోహన్‌ను వివరణ కోరగా ఎర్రమట్టి రవాణాకు ఎవ్వరికి అనుమతి ఇవ్వలేదని, అక్రమ రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కార్మిక వాడలకు స్వచ్ఛమైన నీరందించాలి



ఫిల్టర్ బెడ్‌ను పరిశీలిస్తున్న నాయకులు,అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియాలోని సింగరేణి కార్మికులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మంగళవారం యైటింక్లయిన్ కాలనీలోని ఫిల్టర్ బెడ్‌ను సివిల్ అధికారులతో కలసి పరిశీలించి మాట్లాడారు. సింగరేణి యజమాన్యం సరఫరా చేస్తున్న తాగునీరు వారం రోజుల నుండి మురికిగా వస్తుండడంతో కార్మికులు ఇబ్బదులు పడుతున్నారన్నారు. మురికి నీటితో సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు వ్యాధులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నీటిని శుద్ధి చేసి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని అధికారులను కోరారు. ఏఐటీయూసీ నాయకులు ఫిల్టర్ బెడ్‌ను సందర్శించి సమస్యలను సివిల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్మికులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డీజీఎం సివిల్ ధనుంజయ్, ఈఈ రాజు, రాధాకృష్ణ, ఏఐటీయూసీ నాయకులు ప్రకాష్, రాజారత్నం, అన్నారావు పాల్గొన్నారు.

మంచినీటి ప్లాంట్ ఏర్పాటు చేయాలి

గోదావరిఖని: కార్మికవాడలకు స్వచ్ఛమైన తాగునీరందించాలని ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లాగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్జీ–1 ఏరియాలో ఫిల్టర్‌బెడ్ పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తిలో కీలకపాత్ర వహించే కార్మిక కుటుంబాలకు కలుషిత నీటిని సరఫరా చేయడం వల్ల అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం స్పందించి మిషన్‌భగీరథ తరహాలో మంచినీటిని శుద్ధి చేసే ప్లాంట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

రోడ్లు పాడవుతున్నా పట్టించుకోరా?

- రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతున్న కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు
- ధ్వంసమవుతున్న రోడ్లు..
- పట్టించుకోని అధికారులు



ధ్వంసమైన రోడ్డు



ఎలిగేడు-ధూళికట్ట గ్రామాల మధ్య రోడ్డుపై కేజ్‌వీల్స్‌తో వెళ్తున్న ట్రాక్టర్

ఎలిగేడు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన రవాణా కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చించి బీటీ,సీసీ రోడ్లను నిర్మిస్తున్నాయి. కానీ అధికారుల పర్యవేక్షణ కరువై ప్రజల నిర్లక్ష్యంతో రోడ్లు పాడవుతున్నాయి. కేజ్‌వీల్ ట్రాక్టర్లు రోడ్లపై తిరుగుతుండడంతో లక్షలాది నిధులతో వేసి రోడ్లు కొన్నేళ్లకే పాడవుతున్నాయి.

వరి నాట్ల సీజన్‌లో కేజ్‌వీల్ ట్రాక్టర్లు...

ప్రస్తుత యాసంగి పంటసాగులో భాగంగా ఎలిగేడు మండలంలో చెరువులు కుంటల్లో సమృద్ధిగా నీరు ఉండటంతో వరి నాట్లు జోరుగా వేస్తున్నారు. రైతుల పొలాలు దున్నేందుకు ట్రాక్టర్ యజమానులు ట్రాక్టర్లకు కేజ్‌వీల్స్‌ను అమర్చుకుని ఒక పొలం నుంచి మరో పొలానికి పోయేందుకు రోడ్లపైనే వెళ్తున్నాయి. కేజ్‌వీల్స్‌తో రోడ్లపై ట్రాక్టర్లు తీసుకపోతుండటంతో రోడ్లన్నీ ధ్వంసమవుతున్నాయి. కేజ్‌వీల్స్‌కు రోడ్లు పాడవకుండా రక్షణ పట్టీలు అమర్చకుండా పోతుండటంతో బీ టీ, సీసీరోడ్లపై గీతలు ఏర్పడి వర్షాలు కురిసినప్పుడు నీళ్లు పోయి పెద్ద,పెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులకుప్రమాదకరంగా మారుతున్నాయి.

మండలంలోని రోడ్లు....

మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు నుంచి ర్యాకల్‌దేవుపల్లి, రాములపల్లి వరకు, రాములపల్లి నాగలింగేశ్వరాలయం నుంచి ముప్పిరితోట వరకు, ముప్పిరితోట నుంచి లోకపేట వరకు, ధూళికట్ట నుంచి ముప్పిరితోట వరకు, ధూళికట్ట నుంచి కోనరావుపేట, వడుకాపూర్ బీటీరోడ్లు, మండలంలో అన్ని గ్రామాల్లో కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు తిరుగుతున్నప్పటికీ పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్లన్నీ పగుళ్లబారి ధ్వంసమవుతున్నాయి. ఎలిగేడు నుంచి లలితపల్లి, లాలపల్లి, సుల్తాన్‌పూర్, బుర్హాన్‌మియాపేట రోడ్లు, ఎలిగేడు నుంచి కాట్నపల్లి వరకు, నర్సాపూర్ నుంచి పూసాల వరకు రోడ్లన్నీ గుంతలు పడి వాహనదారులకు ప్రమాదకరంగా మారుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల పట్టింపేదీ?

గ్రామాల్లో కేజ్‌వీల్ ట్రాక్టర్లు ఇష్టారాజ్యాంగా తిరుగుతున్నప్పటికీ పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు ఏలాంటి చర్యలు చేపట్టకపోవడంతో వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను నియంత్రించి రోడ్లు ధ్వంసం కాకుండా కాపాడాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్లపై నడిపిస్తే సీజ్

రోడ్లపై కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు తిరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు రోడ్లు ఎక్కితే రోడ్లు పాడవుతున్నాయి. రక్షణ పట్టీలు లేకుండా ట్రాక్టర్లను రోడ్లపైకి తీసుకొస్తే యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేయిస్తాం. ట్రాక్టర్లను సైతం సీజ్ చేస్తాం.

– నాగరాజమ్మ, తహసీల్దార్, ఎలిగేడు

చర్యలు తీసుకోవాలి



కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు రోడ్లపైకి రాకుండా అధికారులు నియంత్రణ చర్యలు చేపట్టాలి. బీటీ, సీసీ రోడ్లను సంరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. రోడ్లపై గీతలు ఏర్పడితే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

– కొండ రవియాదవ్, సామాజిక వేత్త(ధూళికట్ట)

వ్యాస రచన పోటీల్లో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న విద్యార్థినులు

ముత్తారం: సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ముత్తారం కేజీబీవీ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచినట్లు ఎస్‌వో కమల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 192వ జయంతి సందర్భంగా కేజీబీవీలో డిసెంబర్ 30న వ్యాసరచన పోటీలు నిర్వహించగా అత్యంత ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించినట్లు తెలిపారు. కళాశాల విద్యార్థినులు భవాని, డి, వర్ష, స్కూల్ విభాగం నుంచి ఎస్. విద్యశ్రీ, ఎస్. సహస్ర నగదు బహుమతులు గెలుచుకున్నారు. వీరికి కాటారంలో పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, ఎంపీ వెంకటేశ్‌నేత బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులను బీఆర్ఎస్ మండలఅధ్యక్షుడు పోతుపెద్ది కిషన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుదాటి రవీందర్‌రావు,ఉపాధ్యాయులు అభినందించారు.

పీజీ సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

సుల్తానాబాద్: పట్టణంలోని శ్రీవాణి పీజీ కళాశాల విద్యార్థులు రెండో, నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో అత్యధిక జీపీఎస్ సాధించారని ప్రిన్సిపాల్ బండారి కమలాకర్ తెలిపారు. యూనివర్సిటీ స్థాయిలో అత్యధికంగా జీపీఎస్ సాధించిన విద్యార్థులను అభినందించారు. పీజీ నాలుగో సెమిస్టర్ ఫలితాలలో కొల్లూరు రమ్య ఎంకాం జనరల్ విభాగంలో 7.4 సీజీపీఏతో ప్రథమ స్థానం, అమ్ముల దీక్షిత 6.780 సీజీపీఏతో ద్వితీయ స్థానం, కంప్యూటర్ విభాగంలో చిట్టంపల్లి శిరీష 7.78 ఎస్‌జీపీఏ జనరల్ విభాగంలో మెట్టు శ్రీలేఖ 7.24 కళాశాల టాపర్లుగా నిలిచారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ బండారి కమలాకర్ అభినందించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలసాని శ్రీనివాస్, అధ్యాపకులున్నారు.

మండల వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరణ



రామగుండం: అంతర్గాం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ ఉదయ్‌కిరణ్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఉన్న డాక్టర్ ఫర్హీన్ బదిలీ కాగా, గోదావరిఖని ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ఉదయ్‌కిరణ్ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఎస్‌అండ్‌పీసీ జూనియర్ ఇన్‌స్పెక్టర్‌గా రాజయ్య

రామగిరి: సింగరేణి సంస్థ ఆర్జీ3, ఏపీఏ ఏరియాల ఎస్‌అండ్‌పీసీ జూనియర్ ఇన్‌స్పెక్టర్‌గా పుట్టపాక రాజయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సెంటినరీకాలనీలోని జీఎం కార్యాలయంలో ఆర్జీ–3 జనరల్ మేనేజర్ తన్నీరు వెంకటేశ్వర రావును రాజయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ జూనియర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన చంద శ్రీనివాస్ ఆర్జీ–1 ఏరియాకు బదిలీ కాగా, ఆయన స్థానంలో రాజయ్య బెల్లంపల్లి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చాడు.

సంక్షిప్త వార్తలు

సీపీని కలిసిన ఆర్జీ-1 జీఎం

గోదావరిఖని: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రామగుండం పోలీస్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డిని ఆర్జీ–1 జీఎం కె.నారాయణ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

జూలపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రూ.6 లక్షల పంచాయతీ నిధులతో నిర్మించనున్న సీసీరోడ్డు నిర్మాణానికి మంగళవారం సర్పంచ్ నర్సింహయాదవ్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహేశ్,వార్డు సభ్యులు సంపత్, రమేశ్, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

కాటారం తరలివెళ్లిన బీఆర్ఎస్ నాయకులు

కమాన్‌పూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని బీఎల్ఎం గార్డెన్‌లో మంగళవారం పుట్ట లింగమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సావిత్రిబాయిపూలే జయంతి ఉత్సవాలను మండలం నుంచి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు తరలివెళ్లారు. టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, సర్పంచ్‌లు బొల్లపెల్లి శంకర్ గౌడ్, తాటికొండ శంకర్, నీలం సరిత, పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు పాల్గొన్నారు.

బీఎస్పీ మండల కార్యాలయం ప్రారంభం

జూలపల్లి: బీఎస్పీ మండల కార్యాలయాన్ని జూలపల్లిలో మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి దాసరి హన్మయ్య ప్రారంభించారు. అనంతరం సావిత్రి బాయిపూలే జయంతి ని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళర్పించారు. అనంతరం వడ్కాపూర్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. కార్యక్రమాల్లో పార్టీ జిల్లా ఇన్‌చార్జి చంద్రశేఖర్, నాయకులు కాంతయ్య,ఉమాపతి పాల్గొన్నారు.

టీపీసీసీ ప్రధాన కార్యదర్శికి సన్మానం

జూలపల్లి: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సీనియర్ నాయకుడు ఈర్ల కొమురయ్యను మంగళవారం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మానుమండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులుసన్మానించారు. కొమురయ్య పార్టీకి చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర పదవి ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు అవగాహన

పెద్దపల్లిరూరల్: తల్లిదండ్రులకు పిల్లలకు మధ్య, విద్యార్థులకు,ఉపాధ్యాయులకు నడుమ సమన్వయం ఉండాలని దీనికోసం అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన అవసరమని ట్రైనర్ రాజనర్సయ్య అన్నారు. స్థానిక గాయత్రీ డిగ్రీ, పీజీ కాలేజీలో మంగళవారం డెర్మటి గ్లైపిక్ మల్టీపుల్ ఇంటలిజెన్స్ టాలెంట్ పై అవగాహన కల్పించారు. విద్యార్థి స్థితిని గుర్తించి అందుకనుగుణంగా బోధిస్తే మంచి ఫలితాలొస్తాయన్నారు. గాయత్రీ విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సురేశ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయన నేత్రాలు సజీవం



రాయమల్లు (ఫైల్)

కోల్‌సిటీ: గోదావరిఖని మార్కండేయ కాలనీకి చెందిన రాదండి రాయమల్లు(75) అనే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు మృతిచెందగా కుటుంబసభ్యులు ఆయన నేత్రాలను దానం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. రాయమల్లు అనారోగ్య సమస్యలతో గోదావరిఖనిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందగా, ఆయన నేత్రాలను సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు రాజమౌళి, కేఎస్ వాసుల ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఆరిఫ్ రాయమల్లు కళ్లను సేకరించి, హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్‌కు పంపించారు. ఈ సందర్భంగా మృతుడి భార్య ఈశ్వరి, కుమారుడు రాజ్‌కుమార్‌ను ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రావణ్‌కుమార్, లింగమూర్తి, ప్రతినిధులు అభినందించారు.

నేడు మామిడితోట వేలం

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట గ్రామపంచాయతీకి చెందిన 22 ఎకరాల మామిడితోట కాయలు కోసుకునేందుకు నేడు వేలం నిర్వహించనున్నట్లు సర్పంచ్ పెద్దోళ్ల ఐలయ్య, పంచాయతీ కార్యదర్శి తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన అభ్యర్థులు రూ.20వేలను పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి ముప్పిరితోట పేరు మీద డీడీ లేదా నగదు చెల్లించి పాల్గొనవచ్చని తెలిపారు.

అయ్యప్ప దీక్షాపరులకు ముస్లింల భిక్ష



భిక్ష వడ్డిస్తున్న విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణం స్టేషన్‌రోడ్డులోని భక్తాంజనేయస్వామి ఆలయంలో అయ్యప్ప దీక్షాపరులకు మంగళవారం సయ్యద్ నసీబుల్లా భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విజయరమణారావు పాల్గొని స్వాములకు భిక్ష వడ్డించారు. చైర్మన్ శ్రీనివాసరెడ్డి, సురేశ్‌గౌడ్, మల్లయ్య తదితరులున్నారు.

అయ్యప్ప దీక్షాపరులకు ముస్లింల పండ్లు పంపిణీ

రామగిరి: మండలంలోని నాగేపల్లికి చెందిన ముస్లింలు షమీమ్, షాబోద్దీన్ మంగళవారం లద్నాపూర్ శ్రీగోదారంగనాయకుల ఆలయంలో అయ్యప్ప స్వాములకు అరటిపండ్లను పంపిణీ చేశారు. ప్రతి యేడాది అయ్యప్పదీక్షా పరులకు పండ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.